# సాక్షి చిత్తూరు

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025






## ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

విభిన్న ప్రతిభావంతులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటడం అభినందనీయమని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. - 8లో



## డీకే ఆస్తులపై వివాదం

బెంగళూరులో ఆదికేశవులునాయుడు ఆస్తుల విషయంలో కుమారుడికి మరో వ్యక్తికి వివాదం తలెత్తింది. - 8లో



## సకల దేవతలకు ఆహ్వానం

శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. - 8లో

## న్యూస్‌రీల్

### ఫోర్జరీ కేసు విచారణ తిరిగి ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

**చిత్తూరు అర్బన్ :** చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా పనిచేసిన కళావతి సంతకం ఫోర్జరీపై విచారణ మళ్లీ ప్రారంభమైంది. కదలని తహసీల్దార్ సంతకాల ఫోర్జరీ విషయంపై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో పోలీసుల వెనుకడుగు అనే శీర్షకతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎస్పీ మణికంఠ ఆగ్రహానికి గురయ్యా రు. పూర్తి స్థాయిలో విచారణ పూర్తి చేయాలని తాలూకా ఎస్ఐ మల్లికార్జునకు ఆదేశించారు. మరుగునపడిన ఫోర్జరీ కేసులో కదలిక వచ్చింది. దీనిపై మళ్లీ విచారణను ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయానికి ఫోర్జరీ పత్రంలోని సర్వే నంబర్లు, వాటికి సంబంధించి రాత పూర్వకంగా వివరాలు అడిగారు. ఆ వివరాలను తహసీల్దార్ శనివారం సమర్పించారు. వారంరోజుల్లో కేసు విచారణ పూర్తి చేసి కేసు వివరాలను పూర్తి స్థాయిలో ఎస్పీకి సమర్పించనున్నట్లు తెలిసింది.

### చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై దృష్టి

**చిత్తూరు కార్పొరేషన్ :** జిల్లాలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై దృష్టి పెట్టామని డీపీఓ సుధాకర్‌రావ్ శనివారం తెలిపారు. వీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. క్షేత్రస్థాయిలో పలు వర్మికంపోస్టు కేంద్రాలను తనిఖీ చేశామని చెప్పారు. ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశామన్నారు. క్లాప్‌మిత్రల పెండింగ్ వేతనాలు చెల్లింపు చేస్తున్నామని, అవసరమైన ప్రాంతాల్లో క్లాప్‌మిత్రలను నియమించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో సిబ్బంది రోజు ఉదయం చెత్తను సేకరించి వర్మికంపోస్టు యార్డులకు తరలించే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. సేంద్రియ ఎరువులను తక్కువ ధరకే రైతులకు విక్రయిస్తామన్నారు. జిల్లాలోని 89 వర్మికంపోస్టు షెడ్‌లను రూ.1.65 కోట్లతో మరమ్మతు పనులు చేయిస్తున్నామని డీపీఓ వివరించారు.

### ఓపెన్ స్కూల్ పరీక్షలకు 15 కేంద్రాలు



సూచనలు ఇస్తున్న ఎంఈఓ మోహన్

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఈఓ వరలక్ష్మి హెచ్చరించారు. శనివారం డీఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మార్చి 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 3,419 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. అనంతరం చిత్తూరు ఎంఈవో- 2 మోహన్ చీఫ్‌సూపరింటెండెంట్‌లకు పరీక్షల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఏడీ-2 వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### దళితులు రోడ్డుపై వెళ్లకుండా ఆంక్షలు



అరివాండ్లవూరు దళితవాడకు దారి లేకుండా ట్రెంచ్ కొట్టిన ఓ సామాజిక వర్గం నేతలు

**పెనుమూరు(కార్వేటినగరం):** అరివాండ్లవూరు దళితవాడ నుంచి గొల్లపల్లి వరకు అరకిలోమీటర్ దూరం వరకు మట్టి రోడ్డు ఉంది. శుక్రవారం రాత్రి ఓ సామాజిక వర్గం నేతలు .. దళితులు ఈ మార్గంలో వెళ్లకూడదని ఆంక్షలు విధిస్తూ దళితవాడకు వెళ్లే రోడ్డును జేసీబీతో రాత్రికి రాత్రే తవ్వి దారి లేకుండా చేశారని కాలనీ వాసులు వాపోయారు. రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా వచ్చి కొన్నిఏళ్లగా ఉన్న రోడ్డును నేడు పట్టా భూమిలో ఉందని చెప్పి చేతులు దులుపుకోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళితులు రోడ్డుపై వెళ్లకుండా అడ్డుకుంటున్న ఓ సామాజిక వర్గంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని దళితులకు అండగా నిలవాలని వారు కోరుతున్నారు.

---

ఏదైనా ప్రయత్నం చేయకుండా ఫలితం రాదనేది అందరికీ తెలిసిన సత్యమే.. ఈ సాధనలో ఎన్నో ఒడుదొడుకులు వచ్చినా తట్టుకొని నిలబడినప్పుడే విజయం సొంతం అవుతుందని ఓ రైతు గట్టిగా నమ్మాడు.. అందుకు తగ్గట్లు ఏటా సాగు చేసే టమాటా జూదంలో ఓడిపోయాడు.. కానీ తెలివిగా ప్రయత్నం చేసి పోయిన డబ్బులను దక్కించుకోవాలని పట్టుదలతో ఈ ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా పలమనేరు మండలం కమ్మసంద్రలో ఆపిల్ పంటను సాగు చేసి అధిక దిగుబడులతో టమాటలో పోయిన డబ్బులను ఆపిల్ పంటలో సాధించి మిగిలిన రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

కమ్మసంద్రలోని రైతు బసవరాజు ఆపిల్ తోట





# కమ్మనిసంద్రఆపిల్

- ప్రయోగాత్మకంగా సాగు
- అధిక దిగుబడులు
- తక్కువ ఖర్చుతో గ్యారెంటీ ఆదాయం
- కూలీల బాధ, చీడపీడలు దూరం

**పలమనేరు :** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎక్కువగా టమోటాను రైతులు సాగు చేస్తారు. దీనికి ఎప్పుడు ధరలుంటాయో లేదో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొత్త రకాల పంటల వైపు చూసేలా చేస్తున్నాయి. పలమనేరు నియోజకవర్గంలోని వీకోటకు 10 కిలోమీటర్ల దూరంలో కమ్మసంద్ర గ్రామంలో రైతు బసవరాజు ప్రయోగాత్మకంగా ఒక ఎకరా పొలంలో ఆపిల్‌ను సాగు చేసి అధిక దిగుబడులు సాధించి పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

#### అనుకూలమైన వాతావరణం

ఆపిల్ పంటను ఇప్పటికే చిక్‌బళ్లాపూర్ సమీపంలోని పారేసంద్రలో రైతు నారాయణస్వామి, వాయల్పాడు సమీపంలోని అయ్యవారిపల్లిలో రైతు శివశంకర్‌రెడ్డి ఇప్పటికే ఆపిల్ పంటను సాగు చేస్తున్నారు. ఇక్కడి శీతల వాతావరణం కారణంగా ఆపిల్ సాగుకు అనుకూలమైందని ఆ రైతులు చెబుతున్నారు. ఇక లోకల్ ఊటీగా పిలవబడే పలమనేరు ప్రాంతంలో వేసవి కాలంలోనూ ఉష్ణోగ్రతలు 37 డిగ్రీలకు దాటవు. భవిష్యత్తులో ఇక్కడ ఆపిల్ సాగు మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి దాకా సిమ్లా, డార్జిలింగ్, కశ్మీర్‌లో సాగయ్యే ఆపిల్ పంట ఇక మనం కూడా సాగు చేయబోతున్నాం.

#### రెండేళ్లలోనే దిగుబడులు

వీకోట సమీపంలోని కమ్మసంద్రకు చెందిన బసవరాజు, ముళబాగి సమీపంలోని నారాయణ స్వామి తమ పొలాల్లో ఎకరా చొప్పున ఆపిల్‌ను గతేడాది సాగు చేశారు. బెంగళూరుకు చెందిన చక్రపాణి పారేసంద్ర, ధర్మవరంలో ఆపిల్ నర్సరీని పెట్టి రైతులకు మొక్కలను విక్రయిస్తున్నారు. ఇతను ఆపిల్ సాగుపై హిమాచల్ ప్రదేశ్‌లో పరిశీలన చేసి అక్కడే గ్రాఫ్టింగ్ చేసి మొక్కలను ఇక్కడికి తెచ్చి తన నర్సరీలో ఆరు నెలలు పెంచి ఆపై రైతులకు మొక్క రూ.200గా విక్రయిస్తున్నాడు. దీంతో రైతులు వారి పొలంలో అన్నా, హెచ్ఆర్ఎమ్ఎన్ 99, డోర్‌సెట్ గోల్డెన్ అనే రకాల ఆపిల్‌ను ఎకరాకు 440 మొక్కల చొప్పున గతేడాది నాటారు. మొక్కల మధ్య పొడవు పది, వెడల్పు పది అడుగుల దూరం విడిచిపెట్టారు. ఇవి ఎక్కువగా ఎర్రమట్టి నేలల్లోనే పండుతున్నాయి. నాటిన రెండేళ్ల నుంచి కాతకొస్తున్నాయి. చెట్టుకు 30 కాయల సగటున కాసినట్లు రైతులు తెలిపారు. కాయబరువు 200 గ్రాముల దాకా ఉంటుందని, ఎకరానికి 12 వేల కాయలు కాస్తున్నట్లు చెబుతున్నారు. కాయ ధర రూ.20 అనుకున్నా కోతకు రూ.2.40 లక్షల ఆదాయం ఈ పంటలో దక్కుతోంది.

### సస్యరక్షణ తక్కువే

అన్ని పంటల లాగా ఈ పంటకు కూలీలతో పెద్దగా పని ఉండదు. ఆపిల్ నాటే ముందు పాదుల్లో దిబ్బెరువు, ఆపై మొక్క పెరిగే సమయంలో వేపనూనె, ఫంగిసైడ్స్, డ్రిప్పులో మైక్రో న్యూట్రియన్స్ వేసుకుంటే చాలు. ఈ పంటకు పెద్దగా తెగుళ్ల సమస్య ఉండదని రైతులు చెబుతున్నారు. ఓ సారి పంట సాగు చేస్తే ఆపై పదేళ్ల దాకా కోతలుంటాయి. కాబట్టి ఇక్కడి రైతులు భారీ పెట్టుబడులు పెట్టి టమాటా లాంటి పంటలకు బదులు ఆపిల్ సాగు చేసుకుంటే నికర లాభాలను సాధించే అవకాశం ఉంది.



తోటలోని ఆపిల్ కాయలు (ఫైల్ )

#### సాగుకు ఇప్పడే సమయం..

ఆసక్తి ఉన్న రైతులు ఆపిల్ సాగుకు ఇప్పుడే సమయమని నర్సరీ నిర్వాహకులు చెబుతున్నారు. హిమాచల్ ప్రదేశ్ నుంచి తెప్పించిన గ్రాఫ్టింగ్ మొక్కలు నవంబరు నుంచి నర్సరీలో పెంచి ఫిబ్రవరిలో విక్రయిస్తున్నారు. ఇప్పుడు నాటిన మొక్కలు అనంతపురం జిల్లాలోని ధర్మవరం, కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్‌లో వేసవిలో ఉష్ణోగ్రత 39 డిగ్రీల దాకా ఉన్నప్పటికీ ఆపిల్ బాగా సాగువుతున్నందున పలమనేరు, కుప్పం, పుంగనూరు, బి.కొత్తకోట, మదనపల్లి ప్రాంతాల్లో ఆపిల్ సాగు బాగుంటుందని నిర్వాహకులు తెలిపారు.



నర్సరీలో అమ్మకానికి సిద్ధంగా ఆపిల్ మొక్కలు

#### మూడు రకాల మొక్కలను నాటితే...

ఆపిల్ పండే ప్రాంతాల్లో లాగా ఇక్కడ ఆపిల్ మంచి రుచి, రంగు రావాలంటే అన్నా రకంతో పాటు ప్రతి పది మొక్కల మధ్య రెండేసి హెచ్ఆర్ఎంఎన్ 99, డోర్‌సెట్ గోల్డ్ మొక్కలు నాటుకోవాలి. ఇవి ఉంటేనే ఆపిల్ పంట వస్తుందని నర్సరీ వారు చెబుతున్నారు. ఇవి కోతకొచ్చేముందు పచ్చగా ఉంటూ, ఆపై పసుప రంగులోకి మారి కాయ పక్వానికొచ్చి కోత కొచ్చేసరికి ఎరుపురంగులోకి వస్తుందని తెలిపారు.

#### భలే రుచి ..

ఈ ప్రాంతంలో సాగు చేస్తున్న ఆపిల్ ఎర్రటి రంగులో రుచికరంగా ఉంటున్నాయి. మనం మార్కెట్‌లో కొనే ఆపిల్స్ గట్టిగా మారి లోన పిండిగా ఉంటుంది. అక్కడ ఆపిల్‌ను కోసి కోల్డ్ స్టోరేజ్‌లో రసాయనాలతో నిల్వ బెట్టి ఆపై విక్రయాలు చేయడం కారణంగా కాయలోని గుజ్జు పిండిగా మారిపోతుందని, పోషకాలు ఉండవని స్థానిక రైతు చెబుతున్నారు. కాని ఇక్కడ సాగు చేసే ఆపిల్ చాలా బాగుంటుందని ఇప్పటికే సాగు చేసిన రైతులు తెలిపారు.

#### రెండు కోతల్లోనే ఆదాయం



నేను రెండేళ్ల కిందట ఎకరా పొలంలో ఆపిల్ పంటను సాగు చేశా. పంట బాగా వచ్చింది. కలర్, రుచి చాలా బాగుంది. ఎకరాకు లక్ష ఖర్చు చేశా. రెండు కోతల్లోనే నేను పెట్టిన పెట్టుబడి వచ్చింది. తోటను బాగా చూసుకుంటే వచ్చేది అంతా లాభమే. ముందు టమాటా సాగు చేసి చాలా నష్టపోయా అందుకే కొత్తగా ఏదైనా చేయాలని ఆపిల్‌ను సాగు చేశా.

– బసవరాజు, కమ్మసంద్ర, వీకోట సమీప గ్రామం

#### అవసరమైన రైతులకు మొక్కలు ఇస్తున్నాం



నేను ఆపిల్ సాగుపై పరిశీలనలు చేసి మన ప్రాంతంలో తప్పకుండా ఆపిల్ సాగు చేయవచ్చునని నమ్మి ఇక్కడి రైతులకు ఇచ్చా. సుమారు పది మంది దాకా కర్ణాటక, ఆంధ్రాలో రైతులు ఇప్పుడు ఆపిల్‌ను సాగు చేస్తున్నారు. పంట దిగుబడులు బాగున్నాయి. అవసరమైన రైతులకు మొక్కలను ఇచ్చి పంట ఎలా సాగు చేయాలో సలహాలు ఇస్తున్నాం.

– చక్రపాణి, ఆపిల్ నర్సరీ నిర్వాహకుడు

#### పరిశీలిస్తున్నాం..



గతంలో హార్సిలీహిల్స్‌లో ప్రయోగాత్మకంగా ఆపిల్ మొక్కలను సాగు చేశాం. కాని అనుకున్న ఫలితం దక్కలేదు. కానీ ఇప్పుడు మన వీకోట సమీపంలోనే ఆపిల్ సాగవుతున్నందున ఆ పంటను గమనించి రైతుతో మాట్లాడి ఈ ప్రాంతంలో ఆపిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

– డా.కోటేశ్వర్‌రావు, హార్టికల్చర్ ఏడీ, కుప్పం

---

# పీఏసీఎస్ పనితీరు మెరుగుపడాలి

- జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అభివృద్ధికి ప్రణాళిక
- పారదర్శకంగా రుణాలు అందించి, రికవరి చేయండి
- సమీక్షలో కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ , జిల్లా అధికారులు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని వ్యవసాయ పరపతి సంఘాల పనితీరు మెరుగుపడాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, పశు సంవర్ధక, సంబంధిత సభ్యులతో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అభివృద్ధికి పటిష్ట ప్రణాళికను అమలు చేయాలని కోరారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పనితీరు మరింత మెరుగుపడితే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. పారదర్శకంగా అర్హులైన వారికి రుణాలను మంజూరు చేసి, రికవరీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

**క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలి..**

జిల్లాలో సహకార సంస్థ మేనేజర్లు క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు రుణాల మంజూరులో ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. వ్యవసాయ భూమికి రికార్డులు సరిగా లేని పక్షంలో రుణాలు మంజూరు కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మండల స్థాయిలో వీఆర్ఓ, వీఏఓల సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అవసరం అయితే జిల్లా స్థాయిలో తహశీల్దార్లతో సమీక్షించి చర్యలు తీసుకుంటామన్నారు. పశువుల పెంపకాన్ని ప్రోత్సహించడంలో పాడి రైతులకు రుణాలు అందించేలా పశుసంవర్ధకశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు విద్యార్థులను సొసైటీలుగా ఏర్పడేలా విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని కోరారు. అనంతరం అంతర్జాతీయ సహకార సంవత్సరంగా 2025ను ప్రకటించిన నేపథ్యంలో పోస్టర్‌లను ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా సహకార అధికారిణి నాగవర్ధన, డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు, డీపీఓ సుధాకర్‌రావు, డీఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

---

#### డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.33 వేల జరిమానా

**చిత్తూరు అర్బన్ :** మద్యం తాగి వాహనాలు నడపడం, ఇతర కేసుల్లో ఏడుగురికి రూ.33,050 జరిమానా విధించినట్లు టూటౌన్ సీఐ నెట్టికంటయ్య తెలిపారు. శనివారం చిత్తూరు పరిసరాల్లో తనిఖీలు నిర్వహించగా.. ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడపటం, మరో ముగ్గురు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం , మరో వ్యక్తి , స్థానికులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించడంతో వీళ్లపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. నిందితులు ఏడుగురికి జరిమానా విధిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

#### ముగిసిన టీచర్ల సీనియారిటీ జాబితా కసరత్తు

**చిత్తూరు కలెక్టరేట్ :** టీచర్ల సీనియారిటీ జాబితా ప్రక్రియ విద్యాశాఖ అధికారులు నెల రోజులుగా కుస్తీపట్టి ఎట్టకేలకు పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ టీచర్ల సీనియారిటీ జాబితాను సిద్ధం చేశారు. ఆ జాబితాలను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ శనివారంతో ముగిసిందని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్‌లు 7,534, ఎస్జీటీలు 6,443, హెచ్ఎంలు 408 సీనియారిటీ జాబితా ఆన్‌లైన్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేసినట్లు డీఈఓ తెలిపారు.

#### ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోండి

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని మైనారిటీ అభ్యర్థులు ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఈడీ హరినాథరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తారన్నారు. ఈ నెల 28, మార్చి 4, 14, 18, 28 తేదీల్లో ఉద్యోగ మేళాలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ ఉద్యోగ మేళాలను జిల్లాలోని మైనారిటీ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 98499 01139 నంబర్‌లో సంప్రదించాలని ఈడీ కోరారు.

---

# అధికారుల గైర్హాజరుపై నిలదీత

- హాజరు కాని అధికారులకు షోకాజ్‌లు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న జెడ్పీ ఛైర్మన్
- రూ.3,996 కోట్లతో ప్రతిపాదిత బడ్జెట్
- జెడ్పీ స్టాండింగ్ కమిటీలో నిప్పులు చెరిగిన సభ్యులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్రంలో సీఈఓ రవికుమార్‌నాయుడు

**చిత్తూరు కార్పొరేషన్ :** ప్రభుత్వ జీతం, అలవెన్సులు తీసుకుంటూ ప్రజా సమస్యలపై చర్చించే జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలకు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరంగా పలువురు అధికారులు రావడం లేదని జెడ్పీటీసీలు మండిపడ్డారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో అధికారులను ఏకిపారేశారు. పలు శాఖల హెచ్ఓడీలు రాకుండా కింద స్థాయి అధికారులు వస్తే లాభమేమిటని నిలదీశారు. ఎన్నిసార్లు చెప్పిన తీరు మారడం లేదని మార్చిలో జరిగే సర్వసభ్య సమావేశానికి మూడు జిల్లాల అధికారులు రాకపోతే జెడ్పీటీసీలు బహిష్కరిస్తామని హెచ్చరించారు. దీనిపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహించారు. దీనిపై మూడు జిల్లాల కలెక్టర్లకు ఫిర్యాదు చేసి షోకాజ్ నోటీసు ఇవ్వడానికి ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్లు ధనంజయరెడ్డి, రమ్య, స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి, డిప్యూటీ సీఈఓ జుబేదా, జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రతిపాదిత బడ్జెట్‌కు ఆమోదం**

ఉమ్మడి జిల్లా జెడ్పీ ప్రతిపాదిత బడ్జెట్ (11 శాఖలు) రూ.3,996 కోట్లను సీఈఓ రవికుమార్‌నాయుడు ప్రవేశపెట్టారు. 2024-25 ఆదాయం రూ.3,296 కోట్లు, వ్యయం రూ.2,634 కోట్లని తెలిపారు. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత ఆదాయం రూ.3,996, వ్యయం రూ.3,888 కోట్లు అని ప్రకటించారు. జెడ్పీ, పీఆర్, విద్య, వైద్య, స్త్రీ శిశు సంక్షేమం, డీఆర్‌డీఏ, వ్యవసాయం, పశుసంవర్ధకం, మత్స్యపరిశ్రమ, వెల్ఫేర్, డ్వామా శాఖల పరంగా ఆదాయ, వ్యయాలను తెలియజేయగా సభ్యులు ఆమోదించారు. వేర్వేరుగా కాకుండా సంతలాగా అన్ని సమావేశాలు కలిపి పెట్టేశారు. ఉదయం 10.40 గంటలకు సమావేశం ప్రారంభించి మధ్యాహ్నం 1.30 గంటలకు ముగించారు.

#### ప్రజాప్రతినిధుల తీర్మానాలకు విలువలేదా?

ప్రజాప్రతినిధులంటే అధికారులకు లెక్కలేకుండా పోయిందని నారాయణవనం జెడ్పీటీసీ సుమన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి డ్వామా పీడీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గ్రామసభలో తీర్మానం చేసిన పనులను చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరుకే తప్ప క్షేత్రస్థాయిలో ఆశించిన విధంగా అభివృద్ధి పనులు జరగడం లేదని ఎర్రవారిపాలెం జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ నిధులతో పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. జెడ్పీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వడం లేదని రామకుప్పం జెడ్పీటీసీ నితిన్ అసహనం వ్యక్తం చేశారు. సభ్యులు కానీవారు సమావేశానికి ఎందుకు వస్తున్నారని, ఇది ప్రభుత్వ సమావేశమా లేదా పర్సనల్ ఫంక్షనా అని కుప్పం జెడ్పీటీసీ శరవణ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుప్పంలోనే ఉపాధ్యాయుల పనితీరు నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. విధులకు ఆలస్యంగా వచ్చి తొందరగా వెళ్లిపోతున్నారన్నారు. వీరు బెంగళూరులో స్థిరపడటమే ఇందుకు కారణమన్నారు. కుప్పం నియోజకవర్గంలో 100 మంది ఉపాధ్యాయులు ఇలా రాకపోకలు సాగిస్తున్నారని ఘాటు విమర్శలు చేశారు. బోధన కంటే రియల్ ఎస్టేట్‌పైనే వీరికి మక్కువ అని విమర్శించారు. హౌసింగ్ అధికారుల వద్ద ఎప్పుడు సమాచారం ఉండదని ఏర్పేడు జెడ్పీటీసీ తిరుమల్లయ్య ఎద్దేవా చేశారు. పలువురు జెడ్పీటీసీలు మాట్లాడుతూ.. విద్యాశాఖలో దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగులను, ఉపాధ్యాయులను బదిలీ చేయాలన్నారు. గుండె రంధ్రాలు బ్లాక్ అయినప్పుడు ఉపయోగించే రూ.45 వేలు విలువ చేసే స్టెమి ఇంజెక్షన్‌ను ప్రభుత్వ ఆస్పత్రి లో అందుబాటులో ఉంచామని వైద్యాధికారులు వివరించారు.



సమస్యలపై నిలదీస్తున్న సభ్యులు

## క్లుప్తంగా

### చిత్తూరు ఆస్పత్రిలో జగన్నాథగౌడుకు చికిత్స
– అంబులెన్స్‌లో ఆస్పత్రికి

సాక్షి ఎఫెక్ట్..


చిత్తూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జగన్నాథగౌడు

పలమనేరు : బైరెడ్డిపల్లి మండలం రామనపల్లికి చెందిన జగన్నాథగౌడను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శనివారం అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి అక్కడ చికిత్సలందిస్తున్నారు. బిడ్డను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు డబ్బు లేదని అతడి తల్లి ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై శనివారం 'సాక్షి' దినపత్రికలో 'అయ్యా నాబిడ్డను కాపాడండి' అనే శీర్షికన కథనం ప్రచురితం అయింది. దీనిపై స్పందించిన జిల్లా అధికారుల ఆదేశాలతో ఆ మండల వైద్యాధికారి విజయచంద్ర రోగిని చికిత్స కోసం తరలించారు. ఈ సంఘటనపై బైరెడ్డిపల్లి మండల వాసులు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

### గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


సురేష్ మృతదేహం

పులిచెర్ల (కల్లూరు): రోడ్డు ప్రమాదంలో శుక్రవారం సాయంత్రం మండలంలోని చల్లావారిపల్లె వద్ద మదనపల్లె నుంచి తిరుపతి వెళుతున్న ఆర్టీసీ బస్సును టీవీఎస్‌పై వస్తున్న సురేష్ (27) ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడినట్లు కల్లూరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. వాల్మీకిపురానికి చెందిన సురేష్ బూజు దులిపే కర్రల వ్యాపారం చేస్తూ ద్విచక్ర వాహనంపై వస్తూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య ఏసురాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### బాధిత కుటుంబానికి రూ.2 లక్షల సాయం


చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ రూ.2 లక్షలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చెక్కును కలెక్టర్ అందజేశారు. ఇటీవల జిల్లాలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో పెనుమూరు మండలం జట్టిగుండ్లపల్లికి చెందిన దామోదర్ నాయుడు మృతి చెందారన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.2 లక్షలు అందించినట్లు చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక లో మృతుడి భార్య కరుణ కుమారి వినతి అందజేయడంతో ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

# సకల దేవతలకు ఆహ్వానం

**ఆగమోక్తంగా ముక్కంటీశుడి ధ్వజారోహణం**

- రాత్రి వెండి అంబారీపై ఊరేగిన పార్వతీ పరమేశ్వర్లు
- శివనామస్మరణతో మార్మోగిన ముక్కంటి ఆలయం


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఈ వేడుక సాయంత్రం వరకు సాగింది. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ భక్తుల శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం స్వామి, అమ్మవార్ల మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్ర జలాలను ఆలయంలో చల్లుతూ శుద్ధి చేశారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లు వెండి అంబారీ వాహనంపై ఆశీనులయ్యారు. వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి హారతులు సమర్పించారు. అనంతరం ఆలయం నుంచి శివయ్యగోపురం, రాజగోపురం మీదుగా దేవాంగుల వాహన మండపం వద్దకు తీసుకొచ్చారు. పంచమూర్తులు చతుర్మాఢ వీధుల్లో కనులపండువగా ఊరేగారు. అనంతరం పంచమూర్తులను స్వామివారి గర్భాలయం ముందు ఉన్న స్వర్ణతాపడ ధ్వజస్తంభం వద్ద కొలువుదీర్చారు. అలాగే ఉమాదేవి సమేత చంద్రశేఖర స్వామి త్రిశూలానికి ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

**వేదోక్తంగా సంకల్ప పూజ**

ముందు ధ్వజారోహణం చేసే కొడి దారాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కలశ స్థాపనతో వేదోక్తంగా సంకల్ప పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య హోమం, పూజాధి కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభానికి దర్భధారణ చేశారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య భక్తులు సమర్పించిన కొడి చీరలను దవళ పతాకంతో కలిపి సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజ స్తంభానికి అధిరోహింపజేశారు.

**చుట్టాలకు ఆహ్వానం**

సాయంత్రం ఆలయంలోని యాగశాలలో కలశ స్థాపనతో విశేష పూజలు చేశారు. చతుర్మాఢ వీధుల్లో వెలసిన నవ సంధి వినాయకుల వద్ద ఆగి మంత్రోత్సవాలతో చుట్టాలను శివపార్వతుల కల్యాణానికి విచ్చేయాలంటూ క్షేత్రధర్మంగా అర్చకులు ఆహ్వానం పలికారు.

**దేవరాత్రి ఉత్సవం**

మహాశివరాత్రిలో భాగంగా శనివారం రాత్రి జరిగిన ఉత్సవాన్ని దేవరాత్రిగా కొనియాడారు. రాత్రి వెండి అంబారీ వాహనంపై స్వామి, అమ్మవార్లు పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాల్లో నేడు**

రెండవ తిరునాళ్ల–భూతరాత్రి (మాఘ బహుళ దశమి)

వాహన సేవలు

**ఉదయం 9గంటలకు** : సూర్యప్రభ – చప్పర వాహన సేవ

రాత్రి 8గంటలకు భూత – శుక వాహన సేవ

**ఉభయదాతలు** : శ్రీకాళహస్తి హరిజన సేవా సంఘం తరపున పసల రమణయ్య, గ్రామ పెద్దలు

## కూటమికి తగిన మూల్యం తప్పదు


పీఎస్‌లో సంతకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : అధికారం ఉంది కదా అని ఇబ్బందులు పెడితే తగిన మూల్యం తప్పదని కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆటవిక పాలను జనం గమనించి ఛీదరించుకుంటున్నారని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. ఆ మేరకు స్థానిక పీఎస్‌లో షరతులతో కూడిన బెయిల్‌పై శనివారం ఆయన సంతకం చేసి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఇలాంటి తప్పుడు కేసులతో వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి సర్కారు కక్ష సాధిస్తోందని ఆరోపించారు. త్వరలోనే జనాగ్రహానికి కూటమి ప్రభుత్వం కొట్టుకుపోవడం తథ్యమన్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను గాలికొదిలి వైఎస్సార్‌సీపీ నేతలపై కేసుల రాజకీయం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే విజయం

పెనుమూరు(కార్వేటినగరం) : వినయం, క్రమశిక్షణ విద్యార్థులకు ఆభరణం లాంటివని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సయ్యద్ మౌలా అన్నారు. శనివారం పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, వినయం, విద్య, నిజాయితీ వంటి మంచి లక్షణాలను అలవరుచుకోవాలని సూచించారు. సమాజంలో గొప్పస్థాయికి చేరుకోవాలంటే గురువు, తల్లిదండ్రులపై గౌరవం ఉంటేనే సాధ్యమన్నారు. రాబోయే పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి రోహిత్ మాట్లాడుతూ.. కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ సందేహాలను అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి శారద, అధ్యాపకులు ఉమాపతి, బాబు, ప్రసాద్, కళావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్..
– 35 తులాల బంగారం స్వాధీనం

పెనుకొండ : ఇటీవల పెనుకొండలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి.. రిమాండ్‌కు పంపించారు. అతని వద్ద నుంచి బంగారు రికవరీ చేశారు. నిందితుడు అంతర్రాష్ట దొంగగా గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ రాఘవన్ శనివారం మీడియాకు వెల్లడించారు. అనంతపురంలోని గుల్జార్ పేటకు చెందిన సోహేల్‌ఖాన్ కొన్నేళ్ల కిందట బెంగళూరుకు వెళ్లి స్థిరపడ్డాడు. చోరీలకు అలవాటుపడ్డ సోహేల్‌ఖాన్ కర్ణాటక, ఏపీ, తెలంగాణల్లో పలు చోరీలు చేశాడు. ఈ క్రమంలో జనవరి 20న పెనుకొండలోని నారాయణమ్మ కాలనీ సమీపాన పట్టపగలే హెచ్‌ఎం నాగార్జున ఇంట్లో చొరబడి బీరువా పగులగొట్టి 47.2 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరించుకుపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్పీ రత్న ఆదేశాలతో డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కియా స్టేషన్ ఎస్‌ఐ రాజేష్, సీసీఎస్ సీఐ శివాంజనేయులు తదితర సిబ్బంది పలు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ, ఇతర సమాచారం మేరకు నిందితుడిని గుర్తించారు. అతడు కర్ణాటక రాష్ట్రం తుమకూరులో ఉన్నట్లు సమాచారం అందడంతో ఈనెల 13వ తేదీనే అరెస్ట్ చేశారు. నిందితుడు దొంగిలించిన బంగారును బంగారు బిస్కెట్లుగా మార్చి హైదరాబాద్‌లో అమ్మేశాడు. దీంతో షాపునకు వెళ్లి నిందితుడు విక్రయించిన 35 తులాల బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పెనుకొండ చోరీ కేసుకు సంబంధించి 25 తులాలు, కుప్పంలో జరిగిన దోపిడీకి సంబంధించి 10 తులాలు ఉందని సీఐ పేర్కొన్నారు.

# లక్ష్మీపురంలో శ్మశాన రగడ

- రౌడీలతో భయభ్రాంతులకు గురిచేసిన కూటమి నేతలు
- శ్మశానంలో దారిచ్చే ప్రసక్తే లేదని తేల్చిన గ్రామస్తులు


తహసీల్దార్‌కు తమ గోడు వెల్లబోసుకుంటున్న లక్ష్మీపురం దళితులు

కార్వేటినగరం : మండలంలోని లక్ష్మీపురం శ్మశాన రగడ చినికి చినికి గాలీవానగా మారింది. పార్టీ రంగులు పులుముకోవడంతో ఆ గ్రామం ఏకతాటిపై నిలబడి శ్మశానంలో వ్యవసాయ భూములకు శాశ్వత రోడ్డు ఇచ్చే ప్రసక్తే లేదని భీష్మించారు. తాత్కాలికంగా రాకపోకలు సాగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కొంతకాలంగా సాగుతున్న శ్మశాన సమస్య జఠిలం కావడానికి అధికారపార్టీకి చెందిన ఓ నాయకుడు కారణమయ్యాడు. వారం కిందట చిత్తూరు నుంచి సుమారు 30 మందికిపైగా వాహనాల్లో వచ్చి రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు పీకేసి గ్రామ మహిళలను భయభ్రాంతులకు గురి చేయడంతో రెచ్చిపోయిన గ్రామస్తులు శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే పేరు చెప్పి హల్‌చల్ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తమకు న్యాయం చేయకపోతే జాతీయ రహదారిపై నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం దళితుల శ్మశానంపై గ్రామస్తులకు న్యాయం చేయాలని తహసీల్దార్ నాగరాజుకు వినతిని అందించారు. శ్మశాన వాటికకు పైన ఉన్న రైతులకు రాకపోకలు, పంట నూర్పిడి సమయంలో వాహనాలు రావడానికి అనుమతులున్నాయని అది మాకు సంబంధించిన భూమి అనడానికి ఎవరికీ అధికారం లేదని తహసీల్దార్ చెప్పారు. అలాగే ప్రభుత్వ భూమిలో ట్రెంచ్ ఏర్పాటు చేయడం నేరమన్నారు.

## నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో ఎస్‌ఈలు ఇస్మాయిల్‌అహ్మద్, సురేంద్ర నాయుడు తెలిపారు. సెలవురోజు అయినప్పటికీ స్థానికంగా ఉన్న అన్ని విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలను అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి కరెంటు బిల్లులు కట్టాలన్నారు. హెచ్‌టీ సర్వీసుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతిభకు వైకల్యం అడ్డురాదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో క్రీడల్లో గెలుపొందిన వివిధ ప్రతిభావంతులకు కలెక్టర్ సర్టిఫికెట్‌లు, జ్ఞాపికలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిభకు వైకల్యం అడ్డు కాదని, పట్టుదల, కృషి ఉంటే రాణించవచ్చని విభిన్న ప్రతిభావంతులు నిరూపించారన్నారు. విభిన్న ప్రతిభావంతులు కుంగిపోకుండా జీవితంలో ముందడుగు వేయాలని చెప్పారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ సాధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. విభిన్నప్రతిభావంతుల కోరిక మేరకు త్వరలో రూ.25 వేలు విలువ చేసే క్రీడా సామగ్రి కిట్, వీల్ చైర్‌ను అందిస్తామని కలెక్టర్ ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, పారా స్పోర్ట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు మోహన్‌బాబు, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శరత్ పాల్గొన్నారు.

# డీకే ఆస్తులపై వివాదం


నేలపై పడుకుని నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీనివాస్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్, డీకే ఆదికేశవులు నాయుడుకు చెందిన ఆస్తులపై బెంగళూరులో వివాదం నెలకొంది. దీంతో ఆయన తనయుడు డీఏ శ్రీనివాస్‌కు, మరో వ్యక్తికి వాగ్వాదం చోటుచేసుకున్న వివాదానికి సంబంధించిన వీడియోలు కొన్ని వాట్సాప్‌లో శనివారం వైరల్‌గా మారాయి. ఆదికేశవులు నాయుడు, ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే సత్యప్రభకు బెంగళూరులో ఆస్తులు ఉన్నాయి. వీరిద్దరి మరణానంతరం పలు ఆస్తులు కుటుంబ సభ్యులు సామరస్యంగానే పంచుకున్నట్లు తెలిసింది. అయితే బెంగళూరు వైట్ ఫీల్డ్‌లో రూ.వందల కోట్ల విలువచేసే ఓ స్థలంపై శ్రీనివాస్‌కు, అక్కడున్న ఓ ప్రధాన వ్యక్తికి మధ్య వివాదం నెలకొంది. దీంతో కోర్టుకు ఆశ్రయించినట్లు సమాచారం. ఆస్తికి సంబంధించిన విషయం కోర్టులో ఉండగా, ప్రత్యర్థి ఖాళీ జాగాలో రేకుల షెడ్డు నిర్మిస్తున్నట్లు తెలుసుకుని శ్రీనివాస్ అక్కడకు చేరుకున్నారు. పనులు నిలుపుదల చేయాలని కోరినా, ప్రత్యర్థి పట్టించుకోకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అప్పటికే బెంగళూరు పోలీసులు ఘటనా స్థలంలో ఉండటంతో శ్రీనివాస్‌ను బయటకు లాక్కెళ్లారు. పోలీసుల తీరును నిరసిస్తూ శ్రీనివాస్ నేలపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు. దీనిపై తన న్యాయవాదులతో మాట్లాడి, చట్టపరంగా ముందుకు వెళ్లనున్నట్లు ప్రకటించిన శ్రీనివాస్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది.

# 'ఉపాధి' గోల్‌మాల్‌పై విజిలెన్స్

- వావిల్‌తోటలో కొనసాగుతున్న విచారణ
- రూ. 30 లక్షల వరకు బిల్లులు స్వాహా!
- కూటమి నేతలతో పాటు అధికారుల ప్రమేయం?
- ఉపాధి అక్రమాలు కప్పి పుచ్చేందుకు నేతలు రంగంలోకి..


9 మందిని చూపించి బోగస్ పేర్లు పెట్టిన ఆన్‌లైన్ నివేదిక

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పూతలపట్టు మండలం వావిల్‌తోటలో ఉపాధి పనుల్లో గోల్‌మాల్ తారస్థాయికి చేరింది. గ్రామస్తుల ఫిర్యాదుతో ఉపాధిలో జరిగిన కుంభకోణంపై విజిలెన్స్ అధికారులు విచారణకు దిగారు. రెండు రోజులుగా అధికారులు విచారణ చేపడుతున్నారు. అయితే ఈ విచారణలో పలు విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఆ వివరాలను విజిలెన్స్ అధికారులు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పనులే చేయకుండా బిల్లులు చేసుకున్నారని...నూలుకొండ నుంచి తాటిచెట్టు కాలువ వరకు, గుల్ల ఫ్యాక్టరీ నుంచి పెరుమాళ్ల పల్లి చెరువు, నూలు కొండ నుంచి అబ్బిరెడ్డివూరు కాలువ పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారని విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇక ఈ గోల్‌మాల్ వ్యవహారం బయటికి పొక్కడంతో విచారణకు దిగిన అధికారులు, డ్వామా అధికారులకు అధికార పార్టీ నుంచి ఒత్తిళ్లు మొదలైనట్లు తెలిసింది. ఈ దోపిడీలో క్షేత్ర సహాయకులు, టీఏ, ఏపీఓ, కార్యాలయంలోని ఇతర సిబ్బంది పాత్ర కీలకమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా పర్యవేక్షించిన అధికారుల మౌనం వెనుక అంతర్యమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆరునెలల కాలంలోనే కూటమి నేతలకు దగ్గరుండి రూ.30 లక్షల వరకు బిల్లులు చేయించారనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. గోల్‌మాల్‌కు ప్రధాన ఆధారంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఫొటోలు, బోగస్ పేర్లు ప్రధానంగా ఆధారంగా నిలుస్తున్నాయి. డ్వామా అధికారులు కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతారా? లేక అక్రమాలను బహిర్గతం చేస్తారా అనే అనుమానాలు అందరిలోనూ వ్యక్తం అవుతున్నాయి.